సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
గురువారం। 26। అక్టోబర్। 2023



కనుల పండువగా అమ్మాజీ జాతర
రొళ్ల మండలం జిరేగేపల్లిలో అమ్మాజీ జాతర బుధవారం కనుల పండువగా సాగింది. ఏటా జరిగే ఈ ఉత్సవానికి వేలాదిగా భక్తులు తరలివచ్చారు. 8లో



టమాట కిలో రూ.10
కక్కలపల్లి మండీలో బుధవారం కిలో టమాట గరిష్ట ధర రూ.10 పలికింది. కనిష్టం రూ.4, సరాసరి రూ.8 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
38.4°/ 14.5°

జిల్లాలో బుధవారం పగటి ఉష్ణోగ్రతలు స్థిరంగా, రాత్రి ఉష్ణోగ్రతలు తక్కువగా నమోదయ్యాయి. ఆగ్నేయం దిశగా గంటకు 6 నుంచి 8 కిలో మీటర్ల వేగంతో గాలి వీచింది.

సామాజిక సాధికారత

- ఉమ్మడి 'అనంత'లో నాలుగున్నరేళ్లలో అన్ని వర్గాలకూ సముచిత లబ్ధి
- ఇప్పటికే గడప గడపకూ మన ప్రభుత్వం పేరుతో జనంతో మమేకం
- తాజాగా జగనన్న ఆరోగ్య సురక్షతో జనం గుండె తలుపు తట్టిన సర్కారు
- ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించేందుకే బస్సు యాత్ర
- నేడు శింగనమల నుంచి బస్సు యాత్ర.. బుక్కరాయ సముద్రంలో బహిరంగ సభ

సాక్షి ప్రతినిధి, అనంతపురం : 'మీ కుటుంబానికి ఈ ప్రభుత్వం వల్ల మేలు జరిగిందీ అంటే మళ్లీ మాకు ఓటెయ్యండి'
– ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చెప్పిన మాట ఇది.

చరిత్రలో ఇలా మేలు జరిగి ఉంటే ఓటెయ్యండని ధైర్యంగా అడిగిన ఏకైక ముఖ్యమంత్రి ఈయనే. ఈ మాటలపై రాష్ట్రవ్యాప్తంగానే కాదు ఉమ్మడి అనంతపురం జిల్లాలో బాగా చర్చ జరుగుతోంది. 'మేము మేలు చేశాం.. అది చెప్పడానికే మీ ముందుకు వస్తున్నాం' అంటూ సామాజిక సాధికార యాత్ర జరగబోతోంది. ఈ నెల 26వ తేదీ గురువారం సామాజిక సాధికార బస్సు యాత్ర శింగనమలలో ప్రారంభమై బుక్కరాయసముద్రం చేరుకుంటుంది. అక్కడ బహిరంగసభలో పలువురు మంత్రులు, నాయకులు ప్రసంగించనున్నారు. దీంతో అధికార వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో నూతనోత్తేజం కలుగుతోంది.

అన్ని వర్గాలకూ లబ్ధి

గతంలో ఎస్సీ, ఎస్టీ, బీసీలను ఓటుబ్యాంకుగా మాత్రమే ఉపయోగించుకుని వదిలేసిన ప్రభుత్వాలు ఎన్నో ఉన్నాయి. కానీ వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక.. ప్రభుత్వ పథకాలతో పాటు రాజకీయ పదవులు, నామినేటెడ్ పదవులూ సామాజిక వర్గాల వారీగా దక్కాయి. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు పెద్ద పీట వేస్తూ సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నారు. కులం, మతం, వర్గం తేడా లేకుండా అన్ని పార్టీల వారికీ సంతృప్త స్థాయిలో లబ్ధి చేకూర్చారు.



వైఎస్సార్ సీపీ నేతలతో కలిసి బుక్కరాయసముద్రంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

ఏడాదిగా జనంతోనే మమేకం

ప్రజా సంక్షేమ కార్యక్రమాలు ఇంటింటా వినిపిస్తున్నాయి. గతంలో ఎన్నికల్లో గెలవగానే ఎమ్మెల్యే ఆ ఊరు ఎక్కడుందో కూడా చూడని పరిస్థితి. కానీ భారతదేశంలో ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా ఊర్లే కాదు ప్రతి గడపనూ తాకి వారికి కలిగిన లబ్ధిని వివరించే కార్యక్రమాన్ని ఈ రాష్ట్ర ప్రభుత్వం మాత్రమే చేపట్టింది. ఏడాదిగా ఎమ్మెల్యేలు గడప గడపకూ మన ప్రభుత్వం పేరుతో జనంతోనే మమేకమై ఉన్నారు. జిల్లాలోని ప్రతి నియోజకవర్గంలోని ప్రతి ఇంటినీ ఆ ఎమ్మెల్యే పలకరించే కార్యక్రమం దాదాపుగా పూర్తయింది. సుమారు ఏడాది పాటు ఎమ్మెల్యేలు, కింది స్థాయి నాయకులు ప్రజలతో మమేకం అయ్యారు. ప్రజలకు ఏం చేశామో, ఏ ఇంటికి ఎంత లబ్ధి జరిగిందో ఆధారాలతో సహా ఇవ్వగలిగారు. గ్రామ/వార్డు సచివాలయ పరిధిలోని ప్రతి సమస్యకూ పరిష్కారం చూపించారు. అనంతపురం జిల్లాలో 'గడప గడపకూ మన ప్రభుత్వం' ద్వారా చేపట్టిన పనులకు సుమారు రూ.80 కోట్లు వెచ్చించారు.



యాత్రకు సిద్ధంగా ఉన్న బస్సు

'ఆరోగ్య సురక్ష'తో చెంతకే వైద్యం

జనంతో మమేకం కావడమే కాదు 'జగనన్న ఆరోగ్య సురక్ష' పేరుతో ఆయా ప్రజల గుండె తలుపు తట్టింది ఈ ప్రభుత్వం. రోగులు ఆస్పత్రులకు రావడం పాత మాట.. రోగుల వద్దకే వైద్యులు వెళ్లి ఉచిత సేవలందించిన ఘనత సర్కారు దక్కించుకుంది. వైద్యసిబ్బంది ఇంటింటికీ వెళ్లి పరీక్షలు నిర్వహించారు. ఆ తర్వాత వైద్యులే ఆ ఊళ్లకు వెళ్లి లక్షలాది మందికి వైద్యసేవలు అందించారు. నరాలు, గుండె, కంటి జబ్బులు వంటి ఎన్నో రోగాలకు పరిష్కారం లభించింది.

ఉమ్మడి అనంతపురం జిల్లాలో నాలుగున్నరేళ్లలో వివిధ పథకాల కింద లబ్ధి

పథకం	లబ్ధిదారులు	లబ్ధి (రూ.కోట్లలో)
వైఎస్సార్ చేయూత	90,189	475.81
వైఎస్సార్ నేతన్న నేస్తం	10525	83.99
వసతి దీవెన	55888	191.88
జగనన్న విద్యా దీవెన	57241	366.67
జగనన్న చేదోడు	14882	40.17
వైఎస్సార్ ఈబీసీ నేస్తం	21539	59.54
మౌజన్, ఇమామ్‌లకు	660	34.01

(పైన పేర్కొన్నవే కాకుండా అమ్మ ఒడి, ఆరోగ్యశ్రీ, పెన్షన్‌ల రూపేణా లక్షలాదిమంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు లబ్ధి కలిగింది)

సామాజిక సాధికారత .. చరిత్రాత్మకం

బుక్కరాయసముద్రం: వైఎస్సార్‌సీపీ నాలుగున్నరేళ్ల పాలనలో జరిగిన సామాజిక విప్లవం, సంక్షేమాభివృద్ధిని ప్రజలకు వివరించేందుకు చేపట్టిన 'సామాజిక సాధికారత' బస్సు యాత్ర చరిత్రాత్మకమైనదని శింగనమల ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి అభివర్ణించారు. సామాజిక సాధికారత బస్సుయాత్రలో భాగంగా గురువారం సాయంత్రం నాలుగు గంటలకు బుక్కరాయసముద్రం మండల కేంద్రంలోని అనంతపురం – తాడిపత్రి రహదారి పక్కన అంబేద్కర్ సర్కిల్ దగ్గర బహిరంగ సభ నిర్వహించనున్నారు. సభా స్థలి వద్ద జరుగుతున్న ఏర్పాట్లను బుధవారం ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో జగనన్న అధికారంలోకి వచ్చాక ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ప్రజలకు పథకాల ద్వారా అందించిన లబ్ధి, చట్టసభలు, రాజకీయ పదవులు, నామినేటెడ్ పోస్టుల్లో కల్పించిన సామాజిక న్యాయాన్ని వివరించేందుకు బస్సు యాత్ర చేపట్టారన్నారు. బహిరంగ సభకు డిప్యూటీ సీఎం అంజాద్‌బాషా, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డితో మంత్రులు ఉషశ్రీచరణ్, గుమ్మనూరు జయరాం, ఎంపీలు తలారి రంగయ్య, నందిగం సురేష్, నెల్లూరు ఎమ్మెల్యే అనిల్‌కుమార్ యాదవ్ హాజరవుతున్నారన్నారు. నియోజక వర్గం నుంచి అన్ని వర్గాల ప్రజలు భారీ ఎత్తున హాజరై బహిరంగ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ సునీత, జెడ్పీటీసీ సభ్యుడు భాస్కర్, సర్పంచ్ పార్వతి, వైఎస్సార్ సీపీ నాయకులు ఆలూరి రమణారెడ్డి, అంకె నరేష్ తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

'సురక్ష' సేవలు అందరికీ అందాలి



మొటుకుపల్లి 'సురక్ష' శిబిరంలో రోగులతో మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

కదిరి అర్బన్: 'జగనన్న ఆరోగ్య సురక్ష' శిబిరాల ద్వారా అందించే వైద్యసేవలు అందరికీ అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అరుణ్‌బాబు సూచించారు. బుధవారం ఆయన కదిరి మండలం మోటుకుపల్లిలో నిర్వహించిన 'జగనన్న ఆరోగ్య సురక్ష' శిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా రోగులకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. అనంతరం పలువురు రోగులతో మాట్లాడి వారికున్న ఆరోగ్య సమస్యలు... అందిన సేవల గురించి తెలుసుకున్నారు. సురక్ష శిబిరంలో ఎంతమందికి వైద్యం అందించారని జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి కృష్ణారెడ్డిని ఆరా తీయగా, 300 మందికి వైద్య సేవలు అందించినట్లు ఆయన తెలిపారు. దీంతో కలెక్టర్ మరింత మందికి సేవలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ సుబ్బారావు, తహసీల్దార్ సునీత, మున్సిపల్ కమిషనర్ శ్రీహరిబాబు, ఎంపీడీఓ అంజనప్ప, వైద్యులు ప్రమీల, కావ్య, బాబాఫక్రుద్దీన్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

ఎరువులు, విత్తనాలు సిద్ధంగా ఉంచాలి



రైతుభరోసా కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న అవుటాల రమణారెడ్డి

పుట్టపర్తి టౌన్: రబీ సీజనల్‌లో పంటలు సాగు చేసే రైతుల ఇబ్బంది లేకుండా అవసరమైన ఎరువులు, విత్తనాలు సిద్ధంగా ఉంచాలని జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు అవుటాల రమణారెడ్డి సూచించారు. బుధవారం ఆయన బుక్కపట్నం మండలం గూనిపల్లి, మారాల రైతు భరోసా కేంద్రాలను తనిఖీ చేసి అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... రబీ సీజన్ ప్రారంభమైనందున, రైతులకు కావలసిన సమస్తం రైతు భరోసా కేంద్రాల్లో సిద్ధంగా ఉంచాలన్నారు. అలాగే రైతు సాగు చేసిన ప్రతి పంటనూ పక్కాగా ఈ–క్రాప్ చేయాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల గురించి రైతులకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో వీహెచ్‌ఏలు అన్నపూర్ణ, బాబు తదితరులు పాల్గొన్నారు.

గూనిపల్లిలో భారీ కొండచిలువ



కొండ చిలువను చూపుతున్న అటవీ శాఖ అధికారులు,స్నేక్ క్యాచర్ మూర్తి

పుట్టపర్తి టౌన్: బుక్కపట్నం మండలం గూనిపల్లిలో బుధవారం ఉదయం ఓ కొండ చిలువ కలకలం రేపింది. గ్రామంలోని ఎస్సీ కాలనీలో 18 అడుగుల కొండ చిలువ కనిపించడంతో జనం భయభ్రాంతులకు గురయ్యారు. కొందరు స్థానికులు అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వడంలో వెంటనే వారు స్నేక్ క్యాచర్ మూర్తిని వెంట బెట్టుకుని గూనిపల్లికి వచ్చారు. అతికష్టమ్మీద కొండచిలువను బంధించి అడవిలో వదిలిపెట్టారు.

ఆర్బీకేల్లో ఈ-క్రాప్ ముసాయిదా జాబితా

పుట్టపర్తి అర్బన్: ఖరీఫ్ ఈ–క్రాప్ ముసాదా జాబితాను అన్ని రైతు భరోసా కేంద్రాల్లో గురువారం నుంచి 3 రోజుల పాటు ప్రదర్శించనున్నట్లు జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఖరీఫ్‌లో జిల్లా వ్యాప్తంగా 4,25,084 ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగులోకి వచ్చాయన్నారు. ఆర్బీకే, రెవెన్యూ సిబ్బంది కలిసి ఈ–క్రాప్ నమోదు పూర్తి చేశారన్నారు. ఈ వివరాలను ఆర్బీకేల పరిధిలో గ్రామ సభలు నిర్వహించి చదివి వినిపిస్తారన్నారు. జాబితాలో ఏవైనా అభ్యంతరాలుంటే విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్, హార్టికల్చర్ అసిస్టెంట్లను సంప్రదించి రాత పూర్వకంగా ఫిర్యాదు చేయాలన్నారు. తుది జాబితా ప్రదర్శన తర్వాత మార్పులు, చేర్పులు అవకాశం ఉండదని వెల్లడించారు.

తల్లిపాల వారోత్సవాల్లో 'అనంత'కు 3వ స్థానం



తల్లిపాల శ్రేష్టత గురించి మహిళలకు అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

అనంతపురం అర్బన్: ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు –2023 నిర్వహణలో దేశంలో అనంతపురం జిల్లాకు మూడోవ స్థానం లభించింది. ఈ మేరకు బుధవారం బీపీఎన్ఐ (బ్రెస్ట్ ఫీడింగ్ ప్రమోషన్ నెట్‌వర్క్ ఆఫ్ ఇండియా) నుంచి ఈ–మెయిల్ ద్వారా సమాచారం అందిందని ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి తెలిపారు. కలెక్టర్ గౌతమి నేతృత్వంలో ఆగస్టు ఒకటి నుంచి ఏడో తేదీ వరకు జిల్లావ్యాప్తంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో 'తల్లిపాలు ఇవ్వడం ప్రారంభించడం – ఒక వైవిధ్యాన్ని చూపడం' అనే అంశంతో వివిధ కార్యక్రమాలు నిర్వహించామన్నారు. తల్లిపాల శ్రేష్టత, విశిష్టత తెలియజేసేందుకు ఉమ్మడి గృహ సందర్శనలు, ఆస్పత్రులు, కార్యాలయ సందర్శనలు, అవగాహన సమావేశాలు, ర్యాలీలు, ప్రదర్శనలు, పోటీల ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించామన్నారు. జిల్లాలో చేపట్టిన కార్యక్రమాల నివేదికను బీపీఎన్ఐకు అందించామన్నారు. సమగ్ర పరిశీలన తరువాత ఫలితాలు ప్రకటించారన్నారు.

జిల్లాకు గర్వకారణం..



తల్లిపాల వారోత్సవాల నిర్వహణకు సంబంధించి జాతీయస్థాయిలో మూడో స్థానం రావడం జిల్లాకు గర్వకారణమని అనంతపురం జిల్లా కలెక్టర్ గౌతమి పేర్కొన్నారు. తల్లిపాల వారోత్సవాలను ఐసీడీఎస్ పీడీ, సీడీపీఓలు, అధికారులు, అంగన్‌వాడీ సిబ్బంది అంకితభావంతో నిర్వహించడంతోనే ఈ గుర్తింపు వచ్చిందన్నారు. తల్లీబిడ్డల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. జిల్లాలోని 11 ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలోని 2,302 అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో గర్భిణులు, బాలింతలకు లబ్ధి చేకూరుతోందన్నారు. అందుకు ఫలితంగా ఈ రోజున జాతీయ స్థాయిలో జిల్లా మూడో స్థానంలో నిలిచిందన్నారు.

పోలీసు వ్యవస్థపై నమ్మకం పెంచాలి



మాట్లాడుతున్న ఎస్పీ మాధవరెడ్డి



సమీక్షకు హాజరైన పోలీస్ సిబ్బంది

- రౌడీషీటర్లు, పాతనేరస్తులపై నిరంతర నిఘా
- మట్కా, గ్యాంబ్లింగ్, మద్యం అక్రమ రవాణాను అరికట్టాలి
- నేర సమీక్షలో సిబ్బందికి ఎస్పీ మాధవరెడ్డి ఆదేశం

పుట్టపర్తి టౌన్: హోంగార్డు మొదలు జిల్లా స్థాయి అధికారి వరకూ పోలీసుశాఖలోని ప్రతి ఒక్కరూ బాధ్యతతో పనిచేసి పోలీసు వ్యవస్థపై ప్రజల్లో నమ్మకం పెంచాలని ఎస్పీ మాధవరెడ్డి ఆదేశించారు. బుధవారం ఆయన జిల్లా పోలీస్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో నెలవారీ నేర సమీక్షా నిర్వహించారు. దర్యాప్తు దశలో ఉన్న కేసుల్లో పురోగతి సాధించాలని, జిల్లాలో క్రైం రేటు పూర్తిగా తగ్గించాలని సిబ్బందికి సూచించారు. ఇటీవల కాలంలో నమోదైన కేసులు, దర్యాప్తుపై ఆరా తీశారు. అలాగే కోర్టుల్లో ఉన్న కేసులు, ఇటీవల కాలంలో ముద్దాయిలకు పడిన శిక్షలు, కోర్టు తీర్పుల గురించి ప్రస్తావించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ... ఎన్నికలు సమీపిస్తున్నందున ఇతర ప్రభుత్వ శాఖలనూ సమన్వయం చేసుకొని ముందుకు సాగితే మంచి ఫలితం ఉంటుందన్నారు. చార్జ్ షీట్ వేయడంతో పోలీసు పని పూర్తి కాదని, ముద్దాయికి శిక్ష పడేంత వరకూ జాగ్రత్తగా ఉండాలన్నారు. నేరాల్లో పాలు పంచుకున్న వారు ఎవరైనా చట్ట పరిధిలో శిక్ష పడేవిధంగా దర్యాప్తు చేపట్టాలన్నారు. కోర్టులో కేసులు వీగిపోకుండా సరైన సాక్ష్యాధారాలు సమర్పించాలన్నారు. రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాల్లో వాహన చోదకులను అప్రమత్తం చేస్తూ ప్రమాద సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు.

కార్డెన్ సెర్చ్ చేయాలి..

రౌడీ షీటర్లు, పాత నేరస్తులపై నిరంతరం నిఘా ఉంచాలని ఎస్పీ సిబ్బందిని ఆదేశించారు. అలాగే గ్రామాల్లో కార్డెన్ సెర్చ్ నిర్వహించాలన్నారు. కొత్త వ్యక్తుల కదలికలతో పాటు లాడ్జిలు, హోటళ్లపై ప్రత్యేక నిఘా ఉండే విధంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించాలన్నారు. మహిళలు, చిన్నారులపై అఘాయిత్యాలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. మట్కా, ఎర్రచందనం కేసులను ప్రాధాన్యతగా గుర్తించి తగు చర్యలు తీసుకోవాలన్నారు. మట్కా, గ్యాంబ్లింగ్‌ను పూర్తిగా అరికట్టాలని, మద్యం అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీ కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. స్పందన కార్యక్రమంలో స్వీకరించిన అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించి బాధితులకు న్యాయం చేయాలన్నారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ విష్ణు, స్పెషల్ బ్రాంచ్ సీఐ రవీంద్రారెడ్డి, డీఎస్పీలు వాసుదేవన్, కంజాక్షన్, శ్రీనివాసులు, పీరాతో పాటు పలువురు సీఐలు, సెబ్ అధికారులు పాల్గొన్నారు.

రీసర్వే పనులు వేగవంతం చేయాలి



అధికారులతో సమీక్షిస్తున్న జేసీ చేతన్

పుట్టపర్తి అర్బన్: జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష కింద చేపట్టిన భూముల రీ సర్వే వేగవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ చేతన్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన కలెక్టరేట్‌లోని కోర్టు ఛాంబర్‌లో ఆర్డీఓలు, సర్వే శాఖ అధికారులు, డీఐఓలు, సర్వేయర్లతో సమీక్షించారు. ఇప్పటి దాకా జరిగిన రీ సర్వే పురోగతిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం జేసీ మాట్లాడుతూ... మొదటి దశలో 26 గ్రామాలు, రెండో దశలో 51 గ్రామాల్లో రీ సర్వే పూర్తయ్యిందన్నారు. మిగిలిన గ్రామాల్లో వివిధ దశల్లో రీసర్వే పనులు జరుగుతున్నాయన్నారు. 20 గ్రామాల్లో నోటిఫికేషన్ జారీ చేసినట్లు వెల్లడించారు. జిల్లాలో 125 గ్రామాల్లో ప్రభుత్వ నిబంధనల మేరకు వ్యాల్యుయేషన్ చేయాలన్నారు. భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకే ప్రభుత్వం రీ సర్వే కార్యక్రమం చేపట్టిందన్నారు. అందువల్ల ప్రతి రైతు భూమిని పక్కాగా నమోదు చేయాలన్నారు. రీసర్వేలో పాల్గొంటున్న ప్రతి ఒక్కరూ బాధ్యతతో పనిచేయాలన్నారు. కార్యక్రమంలో పుట్టపర్తి, కదిరి, ధర్మవరం, ఆర్డీఓలు భాగ్యరేఖ, వంశీకృష్ణ, తిప్పేనాయక్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులోకి జెడ్పీ వెబ్‌సైట్

సాక్షి ప్రతినిధి, అనంతపురం: అత్యంత ప్రతిష్ఠాత్మకంగా రూపొందించిన జిల్లా ప్రజాపరిషత్ (జెడ్పీ) అధికారిక వెబ్‌సైట్ బుధవారం ప్రారంభించారు. గత నెలరోజులుగా దీనిపై యంత్రాంగం కసరత్తు అనంతరం అందుబాటులోకి తెచ్చారు. ఇకపై జెడ్పీలో జరిగే అన్ని కార్యకలాపాలు వెబ్‌సైట్‌లో చూసుకోవచ్చు. జిల్లా చరిత్ర, మ్యాప్‌లు, భౌగోళిక చరిత్ర, జెడ్పీలో ముఖ్యుల ఫోన్ నంబర్లు, జిల్లా పరిషత్ పరిధిలోని స్కూళ్లు, మండలాలు ఇలా సర్వసమాచారమూ పొందుపరిచారు. అన్నిటికంటే ముఖ్యంగా జెడ్పీటీసీ సభ్యులకు ప్రత్యేక యూజర్ ఐడీలు, లాగిన్ ఇచ్చారు. ఇకపై కార్యక్రమాల పురోగతి ఎప్పటికప్పుడు తెలుసుకోవడమే కాకుండా అభిప్రాయాలను పంచుకోవచ్చు. రాష్ట్రంలో గుంటూరు తర్వాత ఉమ్మడి అనంతపురం జిల్లా పరిషత్‌కు మాత్రమే వెబ్‌సైట్ రూపొందించారు. జెడ్పీ వెబ్‌సైట్: https://zpananthapuramu.ap.gov.in

పారదర్శక సేవలు..

ఇకపై సేవలన్నీ పాదర్శకంగా ఉంటాయి. ప్రతి పనికీ జెడ్పీ కార్యాలయానికి రావాల్సిన అవసరం ఉండదు. ఆన్‌లైన్ ద్వారానే సంప్రదించవచ్చు. పనుల పరిస్థితినీ వెబ్‌సైట్‌ద్వారానే చూసుకోవచ్చు. దీనివల్ల జెడ్పీలో జరిగే ప్రతి విషయమూ తెలుసుకునే వీలుంటుంది. త్వరలోనే ఫైళ్లన్నీ మాన్యువల్ నుంచి ఆన్‌లైన్‌కు తీసుకొస్తున్నాం. – కేతన్‌గార్గ్, జాయింట్ కలెక్టర్

సత్యసాయి జయంతికి పకడ్బందీ ఏర్పాట్లు



అధికారులు, పాలకమండలి సభ్యులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

- భక్తులకు ఎలాంటి అసౌకర్యమూ కలగకుండా చర్యలు తీసుకోవాలి
- సమీక్షలో పుట్టపర్తి ఎమ్మెల్యే దుద్దుకుంట

ప్రశాంతి నిలయం: త్వరలో జరగనున్న సత్యసాయి జయంతి వేడుకలకు దేశవిదేశాల నుంచి భక్తులు తరలివస్తారని, వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన పట్టణంలోని తన క్యాంప్ కార్యాలయంలో మున్సిపల్, పబ్లిక్ హెల్త్ అధికారులు, మున్సిపల్ పాలక మండలి సభ్యులతో సత్య సాయి జయంతి ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ప్రభుత్వం తరఫున చేపట్టాల్సిన అభివృద్ధి పనులను వేగవంతం చేయాలన్నారు. డ్రైనేజీ, శానిటరీ, సెంట్రల్ లైటింగ్, స్ట్రీట్‌లైట్ ఏర్పాటు వంటి పనులను వెంటనే ప్రారంభించాలన్నారు. మున్సిపల్, పబ్లిక్ హెల్త్ అధికారులతో పాటు ఇతర శాఖల అధికారులంతా సమన్వయంతో పనిచేయాలన్నారు. భక్తులకు ఏవిధమైన ఇబ్బంది కలగకూడదన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఓబులపతి, వైస్ చైర్మన్ తిప్పన్న, పబ్లిక్ హెల్త్ డీఈ నరసింహమూర్తి, పుట్టపర్తి మున్సిపల్ కమిషనర్ మాధుసూదన్‌రెడ్డి, మున్సిపల్ ఏఈ స్వాతి, టౌన్ కన్వీనర్ రంగారెడ్డి, కౌన్సిలర్లు సాయిగీత, చెరువు భాస్కర్‌రెడ్డి, పరుశురాం నాయక్, కోఆప్షన్ మెంబర్ రఫీ, మాజీ కౌన్సిలర్ నారాయణరెడ్డి, అనితాశంకర్, సత్య నారాయణ చౌదరి పాల్గొన్నారు.

స్కూల్ గేమ్స్ క్రీడాకారుల ఎంపికకు షెడ్యూల్ జారీ



అనంతపురం: స్కూల్ గేమ్స్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో జిల్లాస్థాయి అండర్–14, 17 క్రీడాకారుల ఎంపికకు షెడ్యూల్ విడుదలైంది. ఈ మేరకు అనంతపురం జిల్లా ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ సుగుణమ్మ, శ్రీసత్యసాయి జిల్లా సెక్రెటరీ అంజన్న, కో ఆర్డినేటర్ నాగరాజు తెలిపారు. అనంతపురం న్యూటౌన్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించే ఎంపికలకు రెండు జిల్లాల క్రీడాకారులు పాల్గొనాలని కోరారు. పూర్తి వివరాలకు న్యూటౌన్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని ఎస్‌జీఎఫ్ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

- ఈ నెల 27న బాల్ బ్యాండ్మింటన్ అండర్–14 బాలురు, బాలికలు, జిమ్నాస్టిక్, బాక్సింగ్, మాల్‌కంబ్ క్రీడాకారుల ఎంపిక.
- 28న కరాటే, 30న బాల్ బ్యాండ్మింటన్, ఫుట్‌బాల్ (అండర్–17), 31న ఫుట్‌బాల్ అండర్–14 బాలుర, బాలికల ఎంపిక.
- నవంబర్ 1న నెట్‌బాల్, టేబుల్ టెన్నిస్, రోప్ స్కిప్పింగ్, రెండో తేదీన సైక్లింగ్, తైక్వాండో, వాలీబాల్, మూడో తేదీన టెన్నికాయిట్ క్రీడాకారుల ఎంపిక.
- నాలుగో తేదీన సెపక్ తక్రా, రోల్ బాల్, షూటింగ్‌బాల్, ఏడో తేదీన రగ్బీ, క్రికెట్, ఎనిమదో తేదీన కబడ్డీ అండర్–14, తొమ్మిదో తేదీన కబడ్డీ అండర్–17, 19న త్రోబాల్, 13న సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్, స్కే మార్షల్ ఆర్ట్స్ క్రీడాకారుల ఎంపికలు కుంటాయి.

క్లుప్తంగా

ఉపకార వేతనాల వివరాలు అప్‌లోడ్ చేయండి

అనంతపురం రూరల్: కేంద్ర ప్రభుత్వం అందించే ఉపకార వేతనాల కోసం నమోదు చేసుకున్న మైనార్టీ విద్యార్థుల బయోమెట్రిక్ వివరాలను జిల్లా నోడల్ అధికారి లాగిన్‌కు వెంటనే పంపాలని జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి మహమ్మద్‌రఫీ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. 9, 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ, బీటెక్, తదితర వృత్తి విద్యాకోర్సులు అభ్యసిస్తున్న 7,006 మంది స్కాలర్‌షిప్‌కు దరఖాస్తు చేసుకోగా, వీరిలో ఇప్పటి వరకూ 6,766 మంది వివరాలు మాత్రమే అప్‌లోడ్ చేశారన్నారు. మిగిలిన విద్యార్థుల వివరాలను ఈ నెల 27వ తేదీలోపు జిల్లా నోడల్ అధికారి లాగిన్‌కు పంపితేనే విద్యార్థులకు స్కాలర్ షిప్ మంజూరవుతుందన్నారు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాళ్లు వీలైనంత తొందరగా విద్యార్థుల వివరాలను నోడల్ అధికారి లాగిన్‌కు పంపాలన్నారు.

'అనంత' శిల్పారామంలో ఖాదీ ఎగ్జిబిషన్ ప్రారంభం



ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న పద్మశ్రీ అవార్డు గ్రహీత చలపతిరావు తదితరులు

అనంతపురం రూరల్: నగర శివారులోని శిల్పారామంలో ఖాదీ మహోత్సవ్- 2023 పేరిట మినీ ఎగ్జిబిషన్ కమ్ సేల్ బుధవారం ప్రారంభమైంది. చేనేత, ఖాదీ, హస్తకళల ఉత్పత్తులను ప్రోత్సహించడంతో పాటు చేనేత వస్త్రాలను ప్రజలకు చేరువ చేయాలన్న ఉద్దేశంతో కేంద్ర టెక్స్‌టైల్స్ మంత్రిత్వ శాఖ, హస్తకళా సేవా కేంద్రం (తిరుపతి) ఆధ్వర్యంలో ఖాదీ మహోత్సవ్ ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథులుగా ఆంధ్రప్రదేశ్ శిల్పారామాల ఏఓ మునిరాజు, నేషనల్ అవార్డు గ్రహీత దళవాయి కుళ్లాయప్ప, పద్మశ్రీ అవార్డు గ్రహీత చలపతిరావు, హ్యాండీక్రాఫ్ట్ అసిస్టెంట్ డైరెక్టర్ సత్యమూర్తి హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చేనేత, హస్తకళల ఉత్పత్తులను ప్రోత్సహించడానికి ప్రభుత్వం అన్ని చర్యలూ తీసుకుంటోందన్నారు. చేతివృత్తిదారులు తమ ఉత్పత్తులను ప్రదర్శించడానికి ఎగ్జిబిషన్ దోహదపడుతుందన్నారు. ఇక్కడ వివిధ జిల్లాల నుంచి వచ్చిన హస్తకళలు, చేనేత, ఖాదీ ఉత్పత్తులను అమ్మకానికి ప్రదర్శిస్తామన్నారు. రోజూ ఉదయం 10 నుంచి రాత్రి 7.30 వరకు ఎగ్జిబిషన్ అందుబాటులో ఉంటుదన్నారు. కార్యక్రమంలో అనంతపురం శిల్పారామం ఏఓ కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా అమ్మాజీ జాతర





ప్రత్యేక అలంకరణలో త్రిశక్తి అమ్మాజీ దేవతలు, ఉత్సవ విగ్రహాన్ని మోసుకెళుతుండగా ప్రణమిల్లుతున్న భక్తులు, ఉత్సవంలో పాల్గొన్న భక్తులు

- వేలాదిగా తరలివచ్చిన భక్తులు

రొళ్ల: మండలంలోని జిరేగేపల్లిలో వెలసిన అమ్మాజీ జాతర బుధవారం కనుల పండువగా సాగింది. దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల అనంతరం ఏటా జరిగే ఈ ఉత్సవానికి వేలాదిగా భక్తులు తరలివచ్చారు. వేకువజామునే అమ్మవార్లకు అభిషేకం, కుంకుమార్చన, గంధాభిషేకం, క్షీరాభిషేకం తదితర పూజలు చేశారు. అనంతరం త్రిశక్తి దేవతలుగా విరజిల్లుతున్న మారక్క, గ్యారక్క, ముడుపక్క దేవత మూర్తుల మూల విరాట్‌లను వెండి, బంగారు ఆభరణాలతో పాటు భక్తులు అందజేసిన పట్టు వస్త్రాలు, వివిధ రకాల పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఉత్సవ విగ్రహాన్ని మేళతాళాలతో పాలబావి వద్దకు ఊరేగింపుగా తీసుకువెళ్లి గంగా జలంతో శుభ్రపరిచి, ఊయ్యాల స్తంభం వద్దకు చేర్చి పట్టంపై కూర్చో బెట్టారు. భక్తుల సందర్శనం అనంతరం మేళతాళాలతో ఆలయానికి చేర్చారు. ఉత్సవ విగ్రహం తీసుకెళ్లే మార్గంలో స్వామి కాలి స్పర్శ కోసం మహిళలు తడి దుస్తులతో బోర్ల పడుకున్నారు. ఇలా చేయడం ద్వారా దీర్ఘకాలిక వ్యాధులు నయమవుతాయని, సంతాన భాగ్యం లేనివారికి సంతానం కలుగుతుందని భక్తుల నమ్మకం. ఉమ్మడి అనంతపురం జిల్లా నలుమూలల నుంచే కాక తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి వేలాదిగా భక్తులు తరలి రావడంతో ఆలయ పరిసరాలు కిక్కిరిసాయి. పలువురు భక్తులు అమ్మవారికి తలనీలలు కూడా సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

19న 'స్పందన' పురస్కారాల ప్రదానం

అనంతపురం కల్చరల్: గత ఏడాదికి సంబంధించి స్పందన ఆత్మీయ సాహితీ పురస్కారాల ప్రదానం నవంబర్ 19న ఉంటుందని అనంత కవుల వేదిక అధ్యక్షుడు తూముచెర్ల రాజారాం, ప్రధాన కార్యదర్శి చంద్రశేఖరశాస్త్రి తెలిపారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. 2022 సంవత్సరానికి సంబంధించి పురస్కారం ప్రముఖ సామాజిక ఉద్యమకారుడైన హైదరాబాదు నివాసి, కవి కృపాకర్ మాదిగ రాసిన 'పంచుకుందాం రా!' బహుజన మహాకావ్యానికి లభించిందన్నారు. 'స్పందన' అనంత కవుల వేదిక ఏర్పడి రెండు దశాబ్దాలు గడిచిన సందర్భంగా స్పందన ద్విదశాబ్ది ప్రత్యేక పురస్కారాలను మరో నలుగురికి అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ విభాగం కింద 'మా నాయిన పాట' కవితా సంపుటి రాసిన కాకినాడకు చెందిన కవి సుంకర గోపాలయ్య, 'కల్లంచుల బువ్వ' దీర్ఘ కవిత రాసిన కళ్యాణదుర్గం కవి రాఘవేంద్ర, 'మొలగొలుకు చేను' కవితా సంపుటి రాసిన నెల్లూరుకు చెందిన కవి పేరిశెట్ల శివకుమార్, 'పూల నిప్పులు' కవితా సంపుటి రాసిన ఆదోనికి చెందిన కవయిత్రి స్వయంప్రభను ఎంపిక చేసినట్లు వివరించారు.

దొంగలు, దోపిడీదారులు జైల్లోనే ఉండాలి

- బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు వైఎస్సార్‌సీపీతోనే న్యాయం
- ఎంపీ గోరంట్ల మాధవ్



మాట్లాడుతున్న ఎంపీ గోరంట్ల మాధవ్ (చిత్రంలో) వైఎస్సార్‌సీపీ అనంతపురం జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, తదితరులు

అనంతపురం టవర్‌క్లాక్: దొంగలు, దోపిడీదారులు, రౌడీలు, గుండాలు జైల్లోనే ఉండాలని హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్ అన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అనంతపురం జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు పైలా నరసింహయ్య, ఉర్దూ అకాడమి చైర్మన్ నదీమ్ అహ్మద్, ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ మంజుల, రజక కార్పొరేషన్ చైర్మన్ మీసాల రంగన్న, డీసీసీబీ చైర్‌పర్సన్ ఎం.లిఖిత, మాజీ చైర్మన్ పామిడి వీరాంజినేయులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గురువారం శింగనమల నియోజకవర్గంలో ప్రారంభం కానున్న సామాజిక సాధికారిక బస్సు యాత్ర, బుక్కరాయసముద్రంలో నిర్వహించే బహిరంగ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సామాజిక, ఆర్థిక న్యాయం చేకూరిందన్నారు. రాజకీయాలలో బడుగులకు అధిక ప్రాధాన్యతనిస్తూ నామినేటెడ్ పదవులు ఇచ్చారన్నారు. చంద్రబాబు తప్పు చేశారు కాబట్టే జైలు జీవితం అనుభవిస్తున్నారన్నారు. తప్పుచేసిన వారు ఎంతటి వారికైనా శిక్ష తప్పదన్నారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఎంతో మంది రాజకీయ నాయకులను చూశామని, అయితే ఇప్పటి వరకూ ప్రజల కోసం శ్రమించింది వైఎస్ జగన్ ఒక్కరేనని స్పష్టం చేశారు. కులమతాలు చూడకుండా అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అందిస్తూ సమ న్యాయం పాటిస్తున్నారన్నారు. ఈ క్రమంలో రాబోవు ఎన్నికల్లో 175 స్థానాలకు 175 స్థానాలు గెలిపించే బాధ్యత ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలందరూ తీసుకోవాలన్నారు. గత ప్రభుత్వంలో చంద్రబాబు మొత్తం ప్రజాధనాన్ని లూటీ చేశారని, ప్రస్తుత ప్రభుత్వంలో సీఎం వైఎస్ జగన్ ప్రజాసంక్షేమానికి ఖర్చు పెడుతున్నారన్నారు. సమావేశంలో బీసీసెల్ నాయకులు పసుపుల ఆది, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు చిత్రా వెంకటేష్ పాల్గొన్నారు.

అర్హుల స్థలాలు క్రమబద్ధీకరిస్తాం

- ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ సుహానా సోని



మాట్లాడుతున్న సుహానా సోని

కదిరి అర్బన్: స్థానిక పారిశ్రామికవాడలో అర్హులైన వారందరి స్థలాలు క్రమబద్ధీకరించనున్నట్లు ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ సుహానా సోని స్పష్టం చేశారు. పారిశ్రామికవాడలోని నౌషాద్ క్వాలిటీ మోడ్రన్ రైస్ మిల్‌లో బుధవారం సిల్క్ రీలర్లకు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. ఆసక్తి ఉన్న సిల్క్ రీలర్లకు పారిశ్రామిక వాడలో స్థలాలను కేటాయిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎవరికైనా సందేహాలు ఉంటే నేరుగా తనతో సంప్రదించి నివృత్తి చేసుకోవాలన్నారు. 1988 నుంచి రీలర్ల సంబంధించిన స్థలాల రికార్డులను పరిశీలించి అర్హులకు న్యాయం చేస్తామన్నారు. సమావేశం నిర్వహించి అర్హులకు స్థలాలు క్రమబద్ధీకరించేలా చర్యలు తీసుకోవాలని ఉత్వర్వులు జారీ చేసిన ఏపీఐఐసీ చైర్మన్ మెట్టు గోవిందరెడ్డికి, సహకరించిన మైనార్టీ వెల్ఫేర్ ఏపీ ప్రత్యేక కార్యదర్శి ఇంతియాజ్ తదితరులకు ఈ సందర్భంగా రీలర్లు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో డిప్యూటీ జోనల్ మేనేజర్ మల్లికార్జున, ఐలా చైర్మన్ టీపీఎం నౌషాద్‌బాషా, డిక్కీ రీజనల్ ప్రెసిడెంట్ కోలా రమణ, కేఎస్ బాహుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

భర్తే చంపడానికి ప్రయత్నిస్తున్నాడు

- ఎస్పీకి వివాహిత ఫిర్యాదు



ఎస్పీ మాధవరెడ్డికి సమస్య విన్నవిస్తున్న ఇందిరమ్మ

పుట్టపర్తి టౌన్: కట్టుకున్న భర్తనే తనను చంపడానికి ప్రయత్నిస్తున్నాడని ఎస్పీ మాధవరెడ్డి ఎదుట ఓ వివాహిత వాపోయింది. ఈ మేరకు బుధవారం కదిరిలోని స్పందన వికలాంగుల మండల సమాఖ్య ఆధ్వర్యంలో ఎస్పీని ఆయన చాంబర్‌లో కలసి వినతి పత్రం అందజేసింది. బాధితురాలు తెలిపిన మేరకు... కదిరి మండలం వీరేపల్లికి చెందిన దుద్దుకుంట రామ్మోహన్‌రెడ్డి మొదటి బార్య చనిపోవడంతో తనకల్లు మండలం పరాకువాండ్లపల్లి గ్రామానికి చెందిన ఇందిరమ్మను ఐదేళ్ల క్రితం రెండో వివాహం చేసుకున్నాడు. కదిరిలోని వైఎస్సార్ నగర్‌లో నివాసముంటున్నారు. ఇందిరమ్మ దివ్యాంగురాలు కావడంతో అదనపు కట్నం కోసం తరచూ వేధింపులకు గురి చేసేవాడు. భర్త డిమాండ్లను నెరవేర్చకపోవడంతో హతమార్చాలని పలుమార్లు ప్రయత్నించాడు. ఆ సమయంలో ఆమె కేకలు పెట్టడంతో స్థానికులు జోక్యం చేసుకుని కాపాడేవారు. ఇదే అంశంపై కదిరి పోలీసులకు ఫిర్యాదు చేసినా వారు పట్టించుకోవడం లేదని వాపోయింది. ఈ క్రమంలోనే తనకు న్యాయం చేయాలంటూ స్పందన వికలాంగుల సమాఖ్యను అభ్యర్థించడంతో సభ్యులు 30 మంది తోడు రాగా ఎస్పీని కలసి వినతి పత్రం అందజేసినట్లు వివరించింది. బాధితురాలితో పాటు సమాఖ్య అధ్యక్షుడు ఇంతియాజ్, నాయకులు వెంకటనారాయణ, నాగరత్నమ్మ, లక్ష్మీదేవి, రామాంజనమ్మ, అరుణ, రమేష్ తదితరులు పాల్గొన్నారు

సూల్క్ బస్సులో మంటలు

లేపాక్షి: మండలంలోని చోళసముద్రం టోల్‌గేట్ వద్ద స్కూల్ బస్సులో మంటలు చెలరేగాయి. హిందూపురంలోని శ్రీచైతన్య పాఠశాలలో చదువుకుంటున్న లేపాక్షికి చెందిన ఆరుగురు విద్యార్థులు బుధవారం సాయంత్రం ఆ పాఠశాల బస్సులో స్వగ్రామానికి తిరుగు ప్రయాణమయ్యారు. టోల్‌గేట్ వద్దకు చేరుకోగానే బస్సు ఇంజన్‌లో నుంచి ఒక్కసారిగా మంటలు ఎగిసి పడడంతో గమనించిన విద్యార్థులు గట్టిగా కేకలు వేశారు. బస్సును రోడ్డు పక్కనే డ్రైవర్ ఆపేశాడు. విద్యార్థులు బయటపడేందుకు ఇబ్బంది పడుతున్న విషయం గమనించిన స్థానికులు వెంటనే అప్రమత్తమయ్యారు. బస్సు డోర్‌ను బలవంతంగా లాగి విద్యార్థులను కాపాడి, మరో బస్సులో లేపాక్షికి పంపారు. బస్సు నిర్వహణ సక్రమంగా లేకపోవడమే ప్రమాదానికి కారణమంటూ ఈ సందర్భంగా పలువురు వ్యాఖ్యానించారు.

28న వేరుశనగ చెక్క వేలం

బుక్కరాయసముద్రం: జిల్లా జైల్లో ఈ నెల 28న వేరువనగ చెక్క వేలం పాట నిర్వహించనున్నట్లు జైలు సూపరింటెండెంట్ రెహ్మాన్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. శనివారం ఉదయం 11 గంటలకు 25వేల కిలోల వేరుశనగ చెక్క వేలం పాట జరుగుతుందని, ఆసక్తి ఉన్న వారు రూ.22వేల డిపాజిట్ చెల్లించి వేలంపాటలో పాల్గొనవచ్చన్నారు.

పేదల ఆరోగ్యానికి సర్కారు భరోసా

- బుధవారం జిల్లాలోని 6 ప్రాంతాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు
- 2,033 మందికి ఓపీ సేవలు అందించిన వైద్యులు



చికిత్స చేస్తున్న వైద్యుడు

ప్రశాంతి నిలయం: వైద్య రంగంలో విప్లవాత్మకమైన మార్పులతో నిరుపేదల ఆరోగ్యానికి వైఎస్ జగన్ సర్కార్ భరోసా ఇస్తోంది. ఈ నేపథ్యంలో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది. బుధవారం జిల్లా వ్యాప్తంగా ఆరు వైఎస్సార్ విలేజ్, అర్బన్ హెల్త్ క్లినిక్‌ల పరిధిలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల ద్వారా 2,033 మంది రోగులకు ఓపీ సేవలు అందించారు. 514 మందికి కంటి పరీక్షలు నిర్వహించి 179 మందికి కంటి అద్దాలు అందజేశారు. శిబిరాల్లో 18 మంది ఎంబీబీఎస్ వైద్యులు, 13 మంది స్పెషలిస్ట్ వైద్యులు పాల్గొన్నారు. కదిరి మండల పరిధిలోని మొటుకుపల్లిలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని కలెక్టర్ అరుణ్‌బాబు సందర్శించి రోగులకు అందుతున్న సేవలను ఆరా తీశారు. కార్యక్రమంలో జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్వీ కృష్ణారెడ్డితోపాటు పలువురు వైద్య అధికారులు పాల్గొన్నారు.

నేడు 19 ప్రాంతాల్లో సురక్ష శిబిరాలు..

గురువారం జిల్లాలోని 19 వైఎస్సార్ విలేజ్, అర్బన్ హెల్త్ క్లినిక్‌ల పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్వీ కృష్ణారెడ్డి తెలిపారు. బత్తలపల్లి మండల ఈ.ముష్టూరు, తాడిమర్రి మండలం కునుకుంట్ల, ముదిగుబ్బ మండలం సంకేపల్లి, తలుపుల మండలం తలుపుల -2 సచివాలయం, నల్లమాడ మండలం వేళ్లమద్ది, బుక్కపట్నం మండల గూనిపల్లి, కొత్తచెరువు మండలం మీర్జాపురం, గుడిబండ మండలం ముత్తుకూర్-2 సచివాలయం, రొళ్ల మండలం కాకి, నల్లచెరువు మండలం ఊబిచెర్ల, గోరంట్ల మండలం మందలపల్లి-2 సచివాలయం, సోమందేపల్లి మండలం పందిపర్తి, హిందూపురం మండలం కిరికెర-3 సచివాలయం, చిలమత్తూరు మండలం చిలమత్తూరు -2 సచివాలయం, ధర్మవరంలోని ఇందిరమ్మ కాలనీ, కేశవనగర్, చంద్రబాబు నగర్, హిందూపురం అర్బన్ పరిధిలోని లక్ష్మీపురం, అగళి మండలంలోని కోడిపల్లిలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు నిర్వహించనున్నారు.

వ్యాసరచన, వక్తృత్వ పోటీలు



వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న కానిస్టేబుళ్లు

పుట్టపర్తి టౌన్: పోలీసులు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా జిల్లా వ్యాప్తంగా పోలీసులకు, విద్యార్థులకు బుధవారం వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఎస్పీ మాధవరెడ్డి ఆదేశాల మేరకు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలతో పాటు పోలీస్ కార్యాలయ సమీపంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో 'సోషల్ మీడియా దుర్వినియోగం, సైబర్ మోసాలను ఎదుర్కోవడంలో సాంకేతిక ప్రభావం' అంశాలపై వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. విజేతలకు పోలీసు అమరవీరుల వారోత్సవాల ముగింపు రోజున బహుమతులు ప్రదానం చేయనున్నట్లు అడిషనల్ ఎస్పీ విష్ణు, ఆర్ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

27న 'బాలయేసు'లో జాబ్‌మేళా

హిందూపురం: స్థానిక బాలయేసు డిగ్రీ కళాశాల ఆవరణలో ఈ నెల 27న జాబ్‌మేళా నిర్వహించనున్నారు. ఈ మేరకు కొడికొండ సమర్థనం దివ్యాంగుల ట్రస్ట్ హెడ్ వెంకటేశ్వర్లు తెలిపారు. బుధవారం హిందూపురంలోని ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ.. 15 ప్రముఖ కంపెనీలు ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి ముందుకు వస్తున్నట్లు పేర్కొన్నారు. 18 నుంచి 32 ఏళ్ల వయసున్న యువతీ, యువకులు అర్హులన్నారు. పది, ఇంటర్, డిగ్రీ, పీజీ పూర్తి చేసిన వారు సంబంధిత ధ్రువీకరణపత్రాలు, బయోడేటాతో ఇంటర్వ్యూలకు నేరుగా హాజరు కావాలన్నారు. పూర్తి వివరాలకు 99498 07396, 95503 94432, 93536 76960, 63053 34287లో సంప్రదించాలని కోరారు. సమావేశంలో సంస్థ రీజినల్ హెడ్ శ్రీనివాసులు, ఐటీ ట్రైనర్ శంకర్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ ఎర్రిస్వామి, శేషకుమార్, మహేష్, ఉమేష్ తదితరులు పాల్గొన్నారు.

పెళ్లి కాలేదని యువకుడి ఆత్మహత్య



హరీష్ (ఫైల్)

పెనుకొండ రూరల్: వయసు మీరిపోతున్నా.. పెళ్లి కాకపోవడంతో జీవితంపై విరక్తి చెంది ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబసభ్యులు తెలిపిన మేరకు... పెనుకొండ మండలం నాగలూరు గ్రామానికి చెందిన వడ్డే హరీష్ (28)కు పెళ్లి చేసేందుకు కుటుంబసభ్యులు కొన్నేళ్లుగా సంబంధాలు చూస్తున్నారు. అయితే ఏ ఒక్కటీ కుదరలేదు. ఈ క్రమంలోనే తన స్నేహితులకు పెళ్లిళ్లు జరిగిపోతుండడంతో మనోవేదనకు లోనైన హరీష్.. మంగళవారం రాత్రి మొక్కజొన్న తోటకు కాపలా వెళ్లి అక్కడే చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. బుధవారం ఉదయం అటుగా వెళ్లిన గ్రామస్తులు విషయాన్ని గుర్తించి సమాచారం అందించడంతో కుటుంబసభ్యులు అక్కడకు చేరుకుని బోరున విలపించారు. ఘటనపై మృతుడి తండ్రి వెంకటేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ రాజేష్ తెలిపారు.

కారు ఢీకొని పాదచారి మృతి

గోరంట్ల: కారు ఢీకొన్న ఘటనలో గొల్లపల్లి గ్రామానికి చెందిన నరసింహమూర్తి (45) మృతి చెందాడు. బుధవారం రాత్రి బెల్లాల చెరువు వైపు నుంచి జాతీయ రహదారిపై వచ్చే క్రమంలో రోడ్డు దాటుతుండగా బెంగళూరు వైపు వేగంగా వెళుతున్న కారు ఢీకొంది. ఘటనలో నరసింహమూర్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదానికి కారణమైన డ్రైవర్ వాహనాన్ని ఆపకుండా దూసుకెళ్లాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

నిండు చూలాలికి ప్రాణం పోశారు

- జీజీహెచ్‌లో గైనిక్, అనస్తీషియా, మెడిసిన్ వైద్యుల ఘనత



కోలుకున్న నాగబిందు

అనంతపురం మెడికల్: ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఓ నిండు చూలాలికి ప్రభుత్వ సర్వజనాస్పత్రి వైద్యులు సకాలంలో కార్పొరేట్ స్థాయి వైద్యం అందించి ఊపిరి పోశారు. వివరాలు.. శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండకు చెందిన వెంకటేష్, నాగబిందు దంపతులు. రెండో సారి గర్భం దాల్చిన నాగబిందును కాన్పు కోసం ఈ నెల 16న ఉదయం 7.30 గంటలకు జీజీహెచ్‌లో కుటుంబసభ్యులు చేర్పించారు. ఆ సమయంలో నిండు గర్భిణి తీవ్రమైన ఆయాసంతో ఊపిరి తీసుకునేందుకు సైతం ఇబ్బంది పడుతుండడం గమనించిన గైనిక్ హెచ్‌ఓడీ డాక్టర్ షంషాద్‌బేగం, డాక్టర్ సుచిత్ర, డాక్టర్ పార్వతి, డాక్టర్ పూజిత తదితరులు వెనువెంటనే వైద్య పరీక్షలు నిర్వహించారు. పల్మనరీ ఎడిమా (ఊపిరితిత్తుల్లో నెమ్ము చేరడం)తో బాధపడుతున్నట్లు గుర్తించి ఏఎంసీలో వెంటిలేటర్‌పై ఉంచారు. ఆ సమయంలో ఆక్సిజన్ శాతం 52, గుండె పని శాతం 30 మాత్రమే ఉంది. ఆమె పరిస్థితిని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు దృష్టికి తీసుకెళ్లి, ఆయన ఆదేశాలతో డాక్టర్ షంషాద్‌బేగం, అనస్తీషియా హెచ్‌ఓడీ డాక్టర్ నవీన్‌కుమార్, మెడిసిన్ హెచ్‌ఓడీ డాక్టర్ భీమసేనాచార్ పర్యవేక్షణలో అడ్మిట్ అయిన రోజే ఉదయం 9.30 గంటలకు సిజేరియన్ చేసి 2.5 కిలోల బరువున్న మగబిడ్డను వెలికి తీశారు. సిజేరియన్ సమయంలో టాప్ లాక్ అనే నూతన విధానాన్ని అనస్తీషియా వైద్యులు అవలంభించారు. శస్త్రచికిత్స అనంతరం కూడా 24 గంటల పాటు నాగబిందును వెంటిలేటర్ పైనే ఉంచి వైద్యం అందించారు. అనంతరం సీ ప్యాప్ ద్వారా మూడ్రోజులపాటు ఆక్సిజన్ అందించారు. ఈ నెల 21న బాలింత ఆరోగ్య పరిస్థితి మెరుగుపడడంతో లేబర్ వార్డులోని హై డిపెండెన్సీయూనిట్(ఐసీయూ)కు తరలించారు. ప్రస్తుతం బాలింత నాగబిందు, ఆమె బిడ్డ ఆరోగ్యంగా ఉన్నారు. తల్లీబిడ్డకు ప్రాణం పోసిన గైనిక్, మెడిసిన్, అనస్తీషియా, చిన్నపిల్లల విభాగం వైద్యులను బుధవారం సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వరరావు అభినందించారు. సాధారణంగా ఈ తరహా కేసులకు ప్రైవేట్ ఆస్పత్రిలో రూ.లక్షల్లో వసూలు చేస్తారని, ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో ఉచితంగా అందించే ఈ చికిత్సపై ప్రజల్లో చైతన్యం తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉందని అభిప్రాయపడ్డారు.

ద్విచక్ర వాహనాలు ఢీ - ఇద్దరికి గాయాలు

ముదిగుబ్బ: స్థానిక ఎస్‌బీఐ శాఖ సమీపంలో బుధవారం రాత్రి రెండు ద్విచక్ర వాహనాలు పరస్పరం ఢీకొన్నాయి. ఘటనలో మల్రా నాగరాజు, వెంకటేష్ గాయపడ్డారు. బాధితులు తెలిపిన మేరకు... నాగరాజు స్కూటీలో ఇంటి వద్ద నుంచి బస్టాండ్ వైపు వెళుతుండగా ఎదురుగా మరో ద్విచక్ర వాహనంపై వస్తున్న వెంకటేష్ ఢీకొన్నాడు. వెంకటేష్‌కు స్వల్ప గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన నాగరాజును 108 అంబులెన్స్‌లో అనంతపురం తరలించారు. ఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు.